క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు



పెద్ద చెరువులో చేపడుతున్న ఉపాధి పనులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం పెద్ద చెరువులో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్నారు. సర్వే నంబర్ 128లో 179 ఎకరాల్లో ఈ చెరువు విస్తరించి ఉంది. రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టి హద్దులు నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం మట్టి పనులు నిర్వహించారు. హద్దుల్లో గట్లు వేసేలా పనులు చేపడుతున్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈఓ త్రినాథరావు

రణస్థలం: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎంఈఓ త్రినాథరావు అన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఒకేషనల్ విద్యలో (వృత్తివిద్య) భాగంగా విద్యార్థులు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. ప్రిన్సిపాల్ పి.శ్రీధర్, ఐటీ విభాగం అధ్యాపకులు రత్నబాబు, అప్పిరల్ విభాగం అధ్యాపకులు సూర్యకుమారి ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ సమావేశం రేపు



స్థలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జి.సిగడాం: ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు జి.సిగడాం రైల్వే స్టేషన్ సమీపంలో వైఎస్సార్‌సీపీ నూతన కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, చెట్టుపొదిలాం సర్పంచ్ భూపతి సురేష్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు దోల వెంకటరమణ, జిల్లా సభ్యులు పిల్లల శివకుమార్ మంగళవారం స్థల పరిశీలన చేపట్టారు. ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ సమావేశం ఉంటుందన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చెరువు ఆక్రమణ



చెరువు స్థలంలో వేసిన మెటీరియల్

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట గ్రామ పంచాయతీ కొయ్యర్లాళ్ల సమీపంలో ఉన్న లత్సయ్య చెరువు ఆక్రమణలకు గురవుతోంది. విలువైన స్థలం కావటంతో సమీపంలో ఉన్న వారు ఆక్రమించి.. పిల్లర్లు, గోడలు కట్టేందుకు సిద్ధమవుతున్నారు. స్థానికులు పలుమార్లు అడ్డుకున్నా.. అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారు. ప్రభుత్వ రికార్డుల మేరకు ఈ చెరువు విస్తీర్ణం 1.63 ఎకరాలుగా (557/3 సర్వే నంబర్‌లో) ఉంది. చెరువు హద్దులు నిర్ణయించాలని స్థానికులు కోరుతున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ బి.గోపాలరావు వద్ద ఈ విషయం ప్రస్తావించగా.. చెరువును పరిశీలించి, ఆక్రమణలు ఉంటే తొలగిస్తామన్నారు. చెరువును ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. స్థానికులు సైతం సర్వే చేపట్టి హద్దులు నిర్ణయించాలని రెవెన్యూ అధికారులను కోరుతున్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి



ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన విద్యార్థినులతో అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని ఎచ్చెర్ల ఎంఈఓ కె.పున్నయ్య అన్నారు. పొన్నాడ కేజీబీవీలో 10వ తరగతి విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా బ్యూటీ అండ్ వెల్నెస్ ఇంటర్న్‌షిప్ కోర్సు నిర్వహించారు. ఈ కోర్సు పూర్తిచేసిన విద్యార్థినులకు మంగళవారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వృత్తి విద్యా కోర్సుల వల్ల చదువుతో పాటు పార్ట్ టైమ్ జాబ్ చేసి ఆదాయం సంపాదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 రాజకిశోర్, ప్రత్యేకాధికారి ఎం.సూర్యకళ పాల్గొన్నారు.

సంక్షోభంలో .. ఆక్వా పరిశ్రమ!

- గిట్టుబాటు కాని రొయ్యల పెంపకం
- ఖర్చు ఎక్కువ.. ఆదాయం తక్కువ
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



లావేటిపేట సమీపంలో ఎగుమతికి సిద్ధంగా ఉన్న రొయ్యలు



రొయ్యల చెరువు

ఎచ్చెర్ల క్యాంపస్: ఆక్వా పరిశ్రమ (రొయ్యలు సాగు) ప్రస్తుతం సంక్షోభంలో ఉంది. రాష్ట్రంలో చాలాచోట్ల రొయ్యలను సాగు చేస్తున్న రైతులు క్రాప్ హాలిడేలు సైతం అమలు చేస్తున్నారు. గిట్టుబాటు కాకపోవటం ప్రధాన సమస్యగా మారింది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో రొయ్యల చెరువులున్నాయి. ఎచ్చెర్ల మండలంలో బుడగుట్లపాలెం, కుప్పిలి, బొంతలకోడూరు, లావేటిపేట, పాతదిబ్బలపాలెం, రణస్థలం మండలంలో కొవ్వాడ, దోనుపేట, కొచ్చర్ల గ్రామాల్లో రొయ్యల చెరువులను సాగు చేస్తున్నారు. రణస్థలం మండలంలో గత కొన్ని నెలులగా సాగు చేసేందుకు ఎవరూ ముందుకు రావటం లేదు. బొంతలకోడూరు పరిధిలో 300 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం చాలా చోట్ల సాగును నిలిపివేస్తున్నారు. ధరలు లేకపోవటం, నష్టాలు రావటం ప్రధాన సమస్యగా మారింది. రొయ్యల చెరువులు నిర్వహణ సైతం ఆర్థికంగా భారం కావటం, కనీస మద్దతు ధర లేకపోవటం, అమెరికా రొయ్యల ఎగుమతిపై సుంకాలు పెంచటం వంటివి సమస్యగా మారాయి.

అమలుకాని మద్దతు ధర..

రొయ్య 100 కౌంట్ కనీసం రూ.270లకు కొనుగోలు జరిగితే నిర్వహణ సాధ్యమవుతోంది. ఉత్పత్తికి సైతం రూ.250 వరకు ఖర్చు అవుతోంది. ప్రభుత్వం ప్రకటించిన ధర రూ.230 వల్ల నష్టం వస్తోంది. మరోపక్క ఈ ధర సైతం సక్రమంగా అమలు కావటం లేదు. ప్రాసెసింగ్ కంపెనీల ప్రతినిధులు, వ్యాపారులు సైతం సిండికేట్‌గా ఏర్పడి ధరలు తగ్గిస్తున్నారు. ఇది సైతం పరిశ్రమపై ప్రభావం చూపుతోంది.

నష్టాలు వస్తున్నాయి



ప్రస్తుతం రొయ్యలు సాగు చేస్తే నష్టం వస్తోంది. దీంతో సాగుకు సాహసం చేయలేక పోతున్నాం. 100 కౌంట్ కిలో రూ.270కి కొనుగోలు చేస్తే కనీసం నిర్వహణ ఖర్చులైనా వస్తాయి. లేదంటే నష్టం తప్పదు. ఈ ప్రభుత్వం సైతం సహకరించటం లేదు. సాగు చేసేవారు తీవ్రంగా నష్టపోతున్నారు.

– అంబటి రాంబాబు, బుడగుట్లపాలెం, మాజీ సర్పంచ్

సాగు ఖర్చులు పెరిగాయి



అక్వా సాగుకు ఖర్చులు ఎక్కువ. విద్యుత్, నిర్వహణ, మేత వంటి వాటికి ఖర్చు ఎక్కువ అవుతుంది. ప్రస్తుతం ఎగుమతులు సైతం సాధ్యం కావటం లేదు. ధరలు తక్కువగా ఉన్నాయి. దీంతో సాగు చేయడం వల్ల నష్టపోతున్నాం. లీజుకు తీసుకొని సాగు చేసేవారు సైతం ఆర్థికంగా నష్టపోతున్నారు. అమెరికా పెంచిన సుంకాల ప్రభావం సైతం పడుతోంది.

పంచిరెడ్డి రాంబాబు, సర్పంచ్, బొంతలకోడూరు

సకల జీవులకు ప్రాణాధారం భూమి



చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న జేడీ త్రినాథస్వామి తదితరులు

శ్రీకాకుళం: భూమి సకల జీవులను ప్రాణాధారమని, అటువంటి భూమాతను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కోరాడ త్రినాథస్వామి అన్నారు. నగరంలోని శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటడంతో పాటు సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మొక్కల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్న జామి చంద్రశేఖర్, శ్రీరామ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, పీజీ గుప్త, బీవీ రవిశంకర్, డాక్టర్ జి.ఎస్.రావు, జి.జగ్గారావు, జి.లక్ష్మి, జి.వాసుదేవరావు, ఎస్.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధరిత్రీ దినోత్సవం



రణస్థలం: ఆదర్శ పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎంఈఓ త్రినాథరావు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని బుడుమూరు ఉన్నత పాఠశాలలో ధరిత్రీ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం ఉరిటి శ్రీనివాసరావు మాట్లాడుతూ భూమి కోట్లాది జీవరాశులకు, మొక్కలకు నిలయమని అన్నారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు మిషన్ లైఫ్‌లో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. క్యూఆర్ కోడ్స్‌ను తయారుచేసి చెట్లు వద్ద ఉంచారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ఉపాధ్యాయుడు పూజారి గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

రణస్థలంలో..

రణస్థలం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంఈఓ ఎ.త్రినాథరావు తెలిపారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో ధరిత్రీ దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలో కొబ్బరి, నేరేడు, మామిడి మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ పి.శ్రీధర్, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

22 ఈటీఎల్ 02 ఎచ్చెర్ల: చెట్టుకు క్యూఆర్ కోడ్‌ను పెడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

శ్రీకాకుళం అర్బన్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని గూనపాలెం సెక్టారు సూపర్‌వైజర్ బి.యోగీశ్వరి అన్నారు. పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా నగరంలోని 33వ డివిజన్ పరిధి కమలానివాస్, మెర్జిడు సెంటర్‌లో పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారంపై గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు కె.కల్యాణి, టి.రాజేశ్వరి, డి.ఇందుమతి, బి.ఆదిలక్ష్మి, ఎ.హైమరత్నబేబి, షమీమా బేగం, ఏఎన్ఎం ఎ.కృష్ణవేణి, ఆశావర్కర్ పి.అమ్మాజీ, హెల్పర్లు హనుమంతు విజయలక్ష్మి, హసీనా తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొట్టడంతోనే విగ్రహం ధ్వంసం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం రూరల్ మండలం భైరి కూడలి వద్దనున్న వైఎస్సార్ విగ్రహం లారీ ఢీకొట్టడంతోనే ధ్వంసమైందని డీఎస్పీ సీహెచ్ వివేకానంద స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని సబ్ డివిజనల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. అనకాపల్లి జిల్లా చోడవరానికి చెందిన ఆర్.రాజు తాలుకా లారీ ఈనెల 20న నరసన్నపేటలోని ఒక రైస్ మిల్లులో నూకల లోడుతో సాయంత్రం 6 గంటలకు అచ్యుతాపురం వెళ్లేందుకు బయల్దేరింది. అయితే లోడుకు మరో 30 బస్తాలు కావాల్సి ఉండగా లారీ డ్రైవర్ ఎస్.హుస్సేన్ భైరి జంక్షన్‌లో ఉన్న గంగమ్మ మోడ్రన్ రైస్ మిల్లు వద్దకు వెళ్లేందుకు నిశ్చయించుకున్నాడు. సాయంత్రం 6.30 గంటలకు భైరి జంక్షన్‌కు వచ్చి ఎడమ వైపు మలుపు తిప్పే క్రమంలో సమీపంలోనే ఉన్న విగ్రహానికి లారీ వెనుక భాగం తగలడంతో విరిగిపడిపోవడం జరిగిందన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బోర గోపి ఆధ్వర్యంలో యువతా మేలుకో – జగతిని ఏలుకో కార్యక్రమాన్ని బాపూజీ కళామందిర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. విద్యార్థులు చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకొచ్చి సమాజానికి ఉపయోగకరంగా తయారవ్వాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు, ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ సూర శ్రీనివాసరావు, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి చంద్రమౌళి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ జి.లలిత, ఏబీవీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ కీర్తి భార్గవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకాంక్షించారు. మండల పరిధిలోని కిష్టప్పపేట గ్రామంలో పాఠశాలను ఉన్నత పాఠశాలగా మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.శైలజ, ఎంఈవో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మేలు



భూసార పరీక్షలు నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

రణస్థలం: భూసార పరీక్షల ద్వారా పంటకు అవసరమయ్యే సూక్ష్మపోషకాల స్థాయిని గుర్తించి మేలైన దిగుబడులు సాధించవచ్చని ఏఓ డి.వి జయ్‌భాస్కర్ సూచించారు. మండలంలోని సంచాం గ్రామంలో భూసార పరీక్షల కోసం మట్టి నమూనా సేకరణపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ప్రతీ రైతు భూసార పరీక్షలు చేసుకోవడం వలన రసాయన ఎరువులపై అనవసర ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు. మండలంలో 1,464 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కోలాటమాడుతున్న చిన్నారులు

జి.సిగడాం: మండలంలోని చెట్టుపొదిలాం గ్రామంలో షిరిడీ సాయిబాబా ఆలయ తృతీయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. పూజ్యగురువులు అమ్ముల సాంబశివరావు ఆశీస్సులతో ఆలయ ధర్మకర్తలు భూపతి అర్జున్‌కుమార్, రమాదేవి పర్యవేక్షణలో హోమాలు చేపట్టారు. ఆలయ ప్రాగంణంలో ప్రత్యేక విద్యుత్ కాంతులను ఏర్పాటు చేశారు. గ్రామంలో బాబా విగ్రహాన్ని ఊరేగించారు. చిన్నారుల కోలాట నృత్యం ఆకట్టుకుంది. బుధవారం ఉదయం 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో సత్యవత్రాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు.

మే 1 నుంచి వేసవి శిబిరం

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లిలోని మన సంస్కృతి మన సాంప్రదాయం ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుంచి వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 ఏళ్లలోపు చిన్నారులకు అరసవల్లిలోని ఆదిత్యా నగర్‌లో శ్లోకాలు, క్రాఫ్ట వర్కు నేర్పనున్నట్లు పేర్కొన్నారు.

తలసేమియా చిన్నారులకు ఉచితంగా రక్తం



చిన్నారికి రక్తం అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలో తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు రెడ్‌క్రాస్ అండగా ఉంటుందని, వారికి ఉచితంగా రక్తం అందిస్తామని రెడ్‌క్రాస్ చైర్మెన్ పి.జగన్మోహనరావు తెలిపారు. మంగళవారం హిరమండలానికి చెందిన భవానీ అనే చిన్నారికి ఉచితంగా రక్తం అందజేశారు. తలసేమియా చిన్నారులకు రక్తాన్ని అందించడంలో లయన్స్ క్లబ్ మార్కెటింగ్ చైర్‌పర్సన్ ఉర్లం శివతేజ, రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, పోలాకి గ్రామానికి చెందిన సాయిలు తమవంతు పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రోగ్రామ్ మేనేజర్ జి.రమణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎ.నరసింగరావు, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుమబిందు

జి.సిగడాం: రోజురోజుకూ ఎండలు పెరుగుతున్న దృష్ట్యా వడదెబ్బ తగలకుండా వృద్ధులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని జి.సిగడాం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుమబిందు సూచించారు. మండలంలోని సీతంపేట గ్రామంలో మంగళవారం వైద్య సేవలు అందించారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 4 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బయట పనులు చేసుకోవాలన్నారు. ఎండలో తిరిగితే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందన్నారు. ఏఎన్ఎం కుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఏసీ నేషనల్ చైర్‌పర్సన్‌గా ఉమ



శ్రీకాకుళం: ఉపాధ్యాయ జేఏసీ నేషనల్ చైర్‌పర్సన్‌గా పాలిశెట్టి ఉమ నియమితులయ్యారు. దీంతో ఆమెకు జోన్ చైర్మన్ వినీత్ కుమార్ జైన్, జేఎఫ్ఎస్ కేవీ రావు, జోన్ అడ్వైజర్ పీఎం జి.శంకర్, జోన్ ప్రెసిడెంట్ సంతోష్ శివకుమార్, ఐపీజెడ్ జి.మధుబాబులు అభినందనలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

శ్రీకాకుళం: పట్టణంలోని జీటీ రోడ్డులో ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం ప్రారంభించారు. వేసవి తీవ్రత నేపథ్యంలో చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ప్రజలు చలివేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈవో డి.సత్యనారాయణ, టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచం మెచ్చిన వ్యక్తి అంబేడ్కర్



మాట్లాడుతున్న సోము వీర్రాజు

శ్రీకాకుళం అర్బన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచం మెచ్చిన వ్యక్తి అని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. నగరంలోని కొత్తరోడ్డు వద్దనున్న సప్తగిరి ఫంక్షన్ హాల్‌లో బీఆర్ అంబేడ్కర్ జయంతోత్సవాలు పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల్లోనే గొప్ప మేధావి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, బీజేపీ నాయకులు పైడి వేణుగోపాలం, పూడి తిరుపతిరావు, అట్టాడ రవిబాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



పూజలందుకుంటున్న భద్రమ్మ తల్లి



ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాతశ్రీకాకుళంలో వేంచేసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్ర పూజలు మంగళవారం జరిగాయి. ఆలయ అర్చకులు బూరాడ వంశీకృష్ణమాచార్యు అర్చకత్వంలో స్వామివారి అభిషేకాలు, భజన మండలి ఆధ్వర్యంలో తిరువీధి భజనలు, హోమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు లోకనాథం నందికేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భద్రమ్మ తల్లికి పూజలు

నగరంలోని బలగ గ్రామ దేవతగా కొలువైన భద్రమ్మ తల్లి అమ్మవారికి మంగళవారం ముర్రాటలు సమర్పించి పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, మహిళలు కలశాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు.

ఉపకరణాల పంపిణీ

జి.సిగడాం: స్థానిక ఎమ్మార్సీలోని భవిత కేంద్రంలో ప్రత్యేకావసరాల పిల్లలకు అవసరమైన ఉపకరణాలను ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు మంగళవారం పంపిణీ చేశారు. వీటిని ప్రభుత్వం సమకూర్చిందన్నారు. హెచ్ఎం చీర రాము, టి.కృష్ణ, సి.హెచ్.మాధురి, కృష్ణవేణి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

24న ముస్లింల ర్యాలీ

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా ముస్లిం ఐక్య సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 24న వక్ఫ్ సవరణ చట్టం–2025కు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు సలీం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు డైమండ్ పార్కు నుంచి ప్రారంభమయ్యే ర్యాలీలో ముస్లిం సోదరులు, సోదరీమణులు పాల్గొనాలని కోరారు. ఏడురోడ్ల కూడలి మీదుగా పాతబస్టాండ్, కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లి కలెక్టర్‌కు మెమోరాండం సమర్పిస్తామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులంతా స్వచ్ఛందంగా పాల్గొని సహకరించాలని కోరారు.

బంగారు బాలలు



బహుమతులతో విద్యార్థులు

ఎచ్చెర్ల: మండలంలోని ముద్దాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 12వ ఆల్ ఇండియా బాలల చిత్రలేఖన పోటీలు, ప్రదర్శనల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలు దక్కించుకున్నారు. విజయవాడలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులు కందుల తరుణ్, నూలు చైతన్య, తామాడ నవీన్, అంబటి సాయి, తేజశ్విని, పడగ పునీత్, గొర్లె పవన్‌లకు పతకాలు లభించాయి. ఈ పోటీల్లో పాల్గొన్న 30 మంది విద్యార్థులకు పీఎంసీ చైర్మన్ దున్న రామ్మోహన్‌నాయుడు చేతులమీదుగా మంగళవారం ధ్రువపత్రాలను అందించారు. పాఠశాల హెచ్ఎం మణిపాత్రుని నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, పద్మజ, అమరావతి, గణపతిరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.